

తలపై క్షీర కలశంతో మంత్రి సవిత

బీసీలను తలెత్తుకునేలా చేసింది టీడీపీనే

- మంత్రి సవిత
- వి.కోటలో వేడుకగా భక్తకనకదాస జయంతి

7

ఈ చెరువు చేపలు.. ఎవరి పరం?

- అక్రమంగా పట్టుకెళుతున్నా పట్టించుకోని చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులు

7

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు

స్వయంభు కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి ఆదివారం నాలుగు గంటల సమయం పట్టింది. సెలవు రోజు కావడంతో వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. ఆలయం వద్ద అయ్యప్ప భక్తులు ఎక్కువగా కనిపించారు. భక్తుల రద్దీ రాత్రి వరకు కొనసాగింది.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి



ఆలయం వద్ద అయ్యప్ప భక్తులు

ఇంత అభివృద్ధి జరుగుతున్నా చెప్పుకోరా?

- ప్రజల్లోకి వెళ్లరెందుకు?
- టీడీపీ శ్రేణులపై సీఎం చంద్రబాబు అసహనం



కుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'నీళ్లిచ్చాం. ఇండస్ట్రీస్ తెస్తున్నాం. యువతకు ఉపాధి కల్పిస్తున్నాం. ఇంత అభివృద్ధి జరుగుతున్నా చెప్పుకునే వారే లేరు. ప్రజల్లోకి వెళ్లి ఎందుకు ప్రచారం చేయడం లేదు' అంటూ టీడీపీ శ్రేణులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. కుప్పం టీడీపీ శ్రేణులతో ఆదివారం సాయంత్రం చంద్రబాబు సుమారు గంటపాటు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ శ్రేణుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను సీఎం ఏకరువు పెట్టారు. ఎక్కడో ఉన్న కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చి చెరువులను నింపాం. కరువుతో బీడుపడ్డ భూములను సశ్యామలం చేశాం. హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న నీటివల్ల భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కూడా తీరిపోయింది. అయినా దీనికి రావాల్సినంత ప్రచారం రాలేదు. మీరు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు చెప్పుకోక పోవడమే అందుకు కారణం అని ఆక్షేపించారు. వేలకోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడానికి ఎన్నో పరిశ్రమలు ముందుకు వచ్చి కడా ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్న విషయాన్ని గుర్తుచేశారు. పరిశ్రమలకు భూముల కేటాయింపు జరిగింది. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు, ఏజెన్సీలు కార్యకలాపాలను ప్రారంభించాయి. అయినా మనం ఎందుకు ప్రచారం చేసుకోలేక పోతున్నాం అని అసంతృప్తి వ్యక్తం చేశారు. కుప్పం నుంచి యువత వలసలు తగ్గాయని, ఉపాధి సదుపాయాలు మెరుగుపడటమే దీనికి కారణమని పేర్కొన్నారు. నేను ముఖ్యమంత్రిగా తరచూ కుప్పం రాలేకపోవచ్చు. కానీ భువనేశ్వరి వస్తున్నారు కదా. ఆమెతోపాటు ప్రజల్లోకి వెళ్లండి. అభివృద్ధిని ప్రచారం చేయడంతోపాటు ప్రజలు ఇంకా ఏమి కోరుకుంటున్నారో తెలుసుకోండి. తీర్చడానికి నేను ఉన్నాను అని భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ చుట్టూ వేస్తున్న రింగ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే రూ.30 కోట్లు విడుదల చేసిన సంగతి గుర్తు చేశారు. ఇంకా రూ.15 కోట్లు మంజూరు చేస్తాను. వెంటనే రింగ్ రోడ్డు పూర్తిచేయండి అని ఆదేశించారు. కుప్పం పట్టణంలోని ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డు విస్తరణ పనులపై ఆరా తీశారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్ బాబుతోపాటు నాలుగు మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాతా ఇచ్చారో ఖతమైనట్టే..!

- అమాయకుల బ్యాంకు అకౌంట్లకు సైబర్ వల
- రూ.కోట్ల మేర క్రైం మనీతో లావాదేవీలు
- కేసుల్లో చిక్కుకుంటున్న సామాన్యులు
- తాజాగా చిత్తూరులో బయటపడ్డ వైనం



మారుతున్న కాలానికి అనుగుణంగా మోసగాళ్లూ ఆరితేరుతున్నారు. సైబర్ నేరగాళ్లయితే మరో అడుగు ముందుకేస్తున్నారు. అమాయకులకు వల వేసి డబ్బు ఎర చూపుతున్నారు. తమ వ్యూహంలో చిక్కాక వారి పేర్లతో ఉన్న బ్యాంకు అకౌంట్లను తీసుకుంటున్నారు. రూ.కోట్లలో క్రైం మనీ జమ చేస్తున్నారు. విషయం తెలియని సామాన్యులు మాత్రం కేసుల్లో చిక్కుకుంటున్నారు.

1ఎక్స్‌బెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో నిధుల మళ్లింపుపై ట్రాక్ చేస్తున్న క్రమంలో ఓ యువకుడి బ్యాంకు అకౌంట్‌లో 2024 ఆగస్టు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు రూ.331 కోట్లు జమైనట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఇంతకీ ఎవరా యువకుడు అని ఈడీ అధికారులు ఆరా తీస్తే ఓ మురికివాడలో రెండు గదుల ఇంట్లో నివాసం ఉంటూ.. ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తేలింది. ఈ ఖాతాను మ్యూల్ అకౌంట్‌గా వినియోగించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఇటువంటి ఘటనే తాజాగా చిత్తూరు నగరం తోటపాళ్యంలోనూ వెలుగుచూసింది.

కూరగాయలమ్మే వ్యక్తికి రూ.12.32కోట్ల నోటీసు

చిత్తూరు తోటపాళ్యానికి చెందిన ఓ వ్యక్తి తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఏడాదికిందట ఇతనికి కొంతమంది రూ.10వేలను ఇచ్చి అతడి పేరుతో ఉన్న బ్యాంకు అకౌంట్‌ను, సిమ్‌కార్డును తీసుకున్నారు. 2024 అక్టోబరు నుంచి ఈ ఏడాది జూలై వరకు అకౌంట్‌లో జరిగిన ఆర్థిక లావాదేవీలకు రూ.12.32 కోట్లను చెల్లించాలని తిరుపతి జీఎస్టీ కమిషనర్ కార్యాలయం నుంచి ఇటీవల అతనికి నోటీసులు అందాయి. దీనిపై విచారిస్తే.. బ్యాంకు అకౌంట్, సిమ్ తీసుకెళ్లినవారు.. ఇతడి పేరుతో ఓ కంపెనీ ఏర్పాటు చేసి, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకున్నట్లు, తప్పుడు బిల్లులతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని తేలింది.

మ్యూల్ అకౌంట్ అంటే..?

దొంగతనాలు, మోసాలు చేసి సంపాదించిన సొమ్మును (క్రైమ్ మనీని) వేరొకరి బ్యాంకు అకౌంట్ ద్వారా అధికారిక సొమ్ముగా మార్చేందుకు ప్రయత్నించడాన్నే 'మనీ మ్యూల్'గా వ్యవహరిస్తున్నారు.ఎంతో కొంత నగదు తీసుకుని,తమ బ్యాంకు అకౌంట్‌ను ఇచ్చేవారిని మ్యూల్‌గా పేర్కొంటున్నారు. అలాంటి అకౌంట్లను మ్యూల్ అకౌంట్ అంటారు.

బ్యాంకు అకౌంట్‌కు నెల అద్దె

బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన లేనివారిని ఎంచుకుని బ్యాంకు అకౌంట్‌ను తమకు ఇచ్చినందుకు ప్రాంతాలనుబట్టి నెలకు రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు సైబర్ నేరగాళ్లు అద్దె కూడా చెల్లిస్తున్నారు. తర్వాత ఈ అకౌంట్‌కు సైబర్ మోసాల ద్వారా వచ్చిన నగదును జమ చేయిస్తున్నారు. ఆపై నగదును దర్జాగా వేరే ఖాతాలకు బదిలీ చేసి వాడేసుకుంటారు. ఈమోసాలపై కేసులు పెడితే సామాన్యులు బలవుతున్నారు.

కఠిన శిక్షలు

ఆర్బీఐ నిబంధనల మేరకు ఓ వ్యక్తి తన అకౌంట్ ద్వారా అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిపితే, మనీలాండరింగ్ చట్టం-2002, బీఎన్ఎస్ (ఐసీసీ), ఐటీ చట్టం కింద క్రిమినల్ కేసుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. నమ్మక ద్రోహం నేరం, మోసం, మనీలాండరింగ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. మూడు నుంచి పదేళ్ల వరకు జైలు తప్పదు.

8.50 లక్షల మ్యూల్ అకౌంట్లు

2025లో సీబీఐ 8.50లక్షల మ్యూల్ అకౌంట్లను గుర్తించింది. ఈ ఏడాది ప్రారంభంలో ఆపరేషన్ చక్ర-వీ కింద సీబీఐ జాతీయ స్థాయిలో ఆపరేషన్ ప్రారంభించింది. డిజిటల్ అరెస్టులు, యూపీఐ ఆధారిత మోసం తదితర ఆరోపణల నేపథ్యంలో 42ప్రాంతాల్లో దాడులు చేశారు. మ్యూల్ అకౌంట్లను తెరిచే క్రమంలో కమీషన్ కోసం బ్యాంకు ఉద్యోగులు, ఏజెంట్లు కూడా భాగమయ్యారని గుర్తించారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

డబ్బుకు ఆశపడితే కటకటాల పాలే

డబ్బు ఆశపడి.. మీ బ్యాంకు అకౌంట్లను ఇతరులకు ఇస్తే మీరు కటకటాల పాలవుతారు. ఓటీపీ, పాస్‌వర్డ్ వంటి వివరాలను దగ్గరి వ్యక్తులతో కూడా పంచుకోవద్దు. డిజిటల్ అరెస్టు పేరుతో కాల్స్ వచ్చినా, తెలియని ఆన్‌లైన్ సైట్లతో ఇన్వెస్ట్ చేయమని, లోన్ మంజూరైందని కాల్స్ వచ్చినా పట్టించుకోకండి. అవన్నీ ఆన్‌లైన్ మోసాలే.

- తుషార్, చిత్తూరు ఎస్పీ

సోమలను వీడని ఏనుగులు

- టమోటా, మామిడి తోటలపై దాడి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

సోమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలాన్ని పది రోజులుగా ఓ నాలుగు ఏనుగులు వీడటం లేదు. శనివారం రాత్రి ఆవులపల్లె పంచాయతీలోని పత్రపల్లె, ఎగువ కొత్తూరు సమీపంలోని టమోటా, మామిడి తోటలపై దాడి చేశాయి. పత్రపల్లెకు చెందిన రమణారెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రఘుపతి రెడ్డి, గోవిందరెడ్డికి చెందిన మామిడి, టమోటా తోటలను తొక్కేసి.. కంచెను, రాతి కూసాలను విరిచేశాయి. ఎగువ కొత్తూరులోని రైతుల తోటలనూ ధ్వంసం చేశాయి. తోటలు ధ్వంసమవడంతో పెట్టుబడి కూడా దక్కదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోటల వద్ద రాత్రి కాపుకాస్తున్న రైతులు ఏనుగులను గమనించి గ్రామానికి పరుగులు తీశారు. ఏడాది కిందట కూడా పత్రపల్లెలో ఏనుగులు దాడి చేయడంతో రాష్ట్ర, జిల్లా స్థాయి అటవీ అధికారులొచ్చి పరిశీలించారు. సోలార్ కంచెతోపాటు ఏనుగుల దాడుల నివారణకు బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని, నష్టపరిహారం పెంచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇకనైనా ఏనుగుల దాడులను నివారించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.



పత్రపల్లె వద్ద ధ్వంసమైన టమోటా తోట

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్

7

టెట్‌కు 8,597 మంది అభ్యర్థులు

దేశ భద్రతలో త్రివిధ దళాల సేవలు అపూర్వం



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రత కోసం త్రివిధ దళాలు అందిస్తున్న సేవలు అపూర్వమని కలెక్టర్ సుమిత్‌కుమార్ కొనియాడారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో త్రివిధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌కు పతాకాన్ని పిన్ చేయడం ద్వారా ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డే హుండీ డ్రైవ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సాయుధ దళాల కోసం కలెక్టర్ విరాళాన్ని హుండీలో వేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు, సైనిక్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్లాగ్‌డే నిధులను మాజీ సైనికులు, వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు వినియోగిస్తామన్నారు. జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి కేవీ రాఘవులు మాట్లాడుతూ.. త్రివిధ దళాల సేవలు దేశానికి గర్వకారణమన్నారు. కార్యక్రమం అనంతరం హుండీ డ్రైవ్‌ను జిల్లాలోని అన్ని విభాగాలు, సంస్థలు, విద్యా సంస్థల వరకు విస్తరించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం మీదుగా పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి నిధులను సేకరించారు.

నీట మునిగి యువకుడి మృతి



జగన్ మృతదేహం

తవణంపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ప్రమాదవశాత్తూ బాహుదానదిలో నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు చవటపల్లెకు చెందిన వాసు, భార్గవిల కుమారుడు జగన్(17) ఆదివారం ఉత్తరబ్రాహ్మణపల్లెలో తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యానికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లాడు. ఈ సందర్భంగా బంధువులు, తల్లిదండ్రులతోకలిసి గ్రామ సమీపంలోని బాహుదానది వద్దకు వెళ్లాడు. జగన్ ప్రమాదవశాత్తూ నదిలో పడి నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని బంధువులు వెలికి తీశారు. చెట్టంత కొడుకు కళ్ల ముందే నీట మునిగి మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఈ చెరువు చేపలు.. ఎవరి పరం?

అక్రమంగా పట్టుకెళుతున్నా పట్టించుకోని చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులు



మహిళా నాయకురాలి అనుచరుల ఆధ్వర్యంలో చెరువులో చేపలు పట్టి తీసుకెళుతున్న వ్యాపారులు


చిత్తూరు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఒక చెరువులో చేపలు పట్టాలంటే సంబంధిత చెరువు ఆయకట్టుదారులంతా సంఘంగా ఏర్పడి అధికారుల సమక్షంలో వేలం వేయాలి. ఆ వేలంలో వచ్చిన డబ్బును సంబంధిత పంచాయతీ లేదా మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగిస్తారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న గంగినేని చెరువు విషయంలో ఇలాంటి నిబంధనలు పాటించడం లేదు. ఈ చెరువులోని చేపలను ఓ మహిళా నాయకురాలు అక్రమంగా పట్టుకెళుతున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీటితో మురుగు చెరువులోకి చేరింది. మొరవలేకపోవడంతో నీరంతా కలుషితమైంది. దానికితోడు గుర్రపుడెక్క మొలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో వర్షపు నీటిలో కొట్టుకొచ్చిన చేపలు పెద్దవి కావడంతో ఓ మహిళా నాయకురాలి కన్ను వీటిపై పడింది. చేపలను అక్రమంగా పట్టించి.. సొమ్ము చేసుకుంటున్నారు. చేపల వ్యాపారులు చెరువులో ఒకసారి వలవేసి చేపలను పట్టుకుంటే వెయ్యి రూపాయలను ఆ మహిళా నాయకురాలికి చెల్లించాలి. ఇందుకోసం ఆమె అనుచరులు ఈ చెరువు వద్ద కాపలా ఉండి చేపల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తుంటారు. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే.. నియోజకవర్గ ప్రజాప్రతినిధి చెప్పడంతోనే చేపలను పట్టుకుంటున్నామని ఆ మహిళా నాయకురాలు అంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.13 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,007
తలనీలాలు సమర్పించినవారు: 39,154

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. వేకువజామునే వేదపండితులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

బీసీలను తలెత్తుకునేలా చేసింది టీడీపీనే

● మంత్రి సవిత ● వి.కోటలో వేడుకగా భక్తకనకదాస జయంతి





కనకదాస విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి సవిత, పక్కన అమరనాథరెడ్డి, క్షీర కలశాలతో ర్యాలీ వస్తున్న మహిళలు

వి.కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలను తలెత్తుకునేలా చేసిన ఘనత టీడీపీకే దక్కిందని మంత్రి సవిత తెలిపారు. భక్తకనకదాస జయంతిని ఆదివారం వి.కోట పట్టణంలో వేడుకగా నిర్వహించారు. ఉదయం పలమనేరు నియోజకవర్గ పరిధిలోని కురబకుల మహిళలు వేలాదిగా క్షీర కలశాలతో స్థానిక ఎగువ చెక్‌పోస్టు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంత్రి సవిత కూడా తలపై క్షీర కలశాన్ని పెట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి అమరనాథరెడ్డి, కర్ణాటక రాష్ట్రం కోలారు ఎమ్మెల్యే వర్తూర్‌ప్రకాష్ తదితర నేతలతో కలిసి భక్తకనకదాస విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అలాగే ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న భక్తకనకదాస విగ్రహానికి పుష్పాంజలి సమర్పించాక స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. టీడీపీని ఎన్టీఆర్ స్థాపించాక బీసీలను అక్కున చేర్చుకుని చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించారన్నారు. ఆయన చలువతోనే బీసీ మహిళలకు స్థానిక సంస్థల్లో అగ్రభాగం దక్కుతోందని తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు సైతం బీసీ సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అందుకే టీడీపీ బీసీల పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. భక్తకనకదాస చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. రాష్ట్ర కురబ, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం గౌడ, రంగనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, కురబ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణప్ప, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాంబాబు, ఈశ్వర్‌గౌడ, జిల్లా కార్యదర్శి శబరీష్, విండో చైర్మన్ హరినాథరెడ్డి, కురబకుల నేతలు విశ్వనాథ్, బలరాం, ఉమాపతి, బాలకృష్ణ, మూర్తి, జయరామేగౌడు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయాభివృద్ధికి కృషి చేయండి

● పాలకవర్గానికి ఎమ్మెల్యే మురళీమోహన్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్ - హాజరైన అభిమానులు



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి ట్రస్టు బోర్డు ద్వారా కృషి చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. కాణిపాక క్షేత్రంలో ఆదివారం చైర్మన్ మణినాయుడు ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్నందున బోర్డు సభ్యులంతా మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక అభిమానంతో మణినాయుడికి రెండోసారి చైర్మన్ పదవి కట్టబెట్టారన్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా సభ్యులందరూ పనిచేయాలన్నారు. దాతల సహకారంతో ఆలయం వద్ద ఉచిత సేవలు చేసేలా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించడానికి ఆలయం తరఫున కృషి చేయాలని చెప్పారు. దీనిపై తొలి సమావేశంలో నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాల్లో హోమ మండపాన్ని నిర్మించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కోరారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ తన తండ్రి చెన్నకేశవులు పేరిట జీజేఎం ట్రస్టు ద్వారా త్వరలో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ట్రస్టు చైర్మన్‌ను, బోర్డు సభ్యులను అభిమానులు,బంధువులు, స్నేహితులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచలకిషోర్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, యాదవ కార్పొరేషన్ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్, నరసింహారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, మాజీ ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివాసులు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.ఆర్.మదన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక సుందరరాజుపురంలోని విజయం విద్యాసంస్థల సమావేశ మందిరంలో జరిగింది. ఎన్నికల అధికారిగా అనంతపురం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, పరిశీలకులుగా బాల గంగిరెడ్డి, చిత్తూరుకు చెందిన గంటా మోహన్ వ్యవహరించారు. సమావేశమయ్యాక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఇలియాస్ బాషా, ఆర్థిక కార్యదర్శిగా పురుషోత్తం, గౌరవ అధ్యక్షుడిగా పీతాంబరరాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గంటా మోహన్, దేవరాజులురెడ్డి, చంద్రన్, చంద్రశేఖర్‌నాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కమలాపతి, బొబ్బిలిరెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శులుగా కిషోర్ కుమార్‌రెడ్డి, సుల్తాన్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజేష్‌కుమార్, గణపతి, కోదండయ్య, కుమారస్వామిరెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్‌గా రాధాకుమారి ఎన్నికయ్యారు. కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగనుంది.

ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యవర్గం



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో జరిగిన కార్యవర్గానికి ఎన్నికల అధికారిగా రాజేంద్రప్రసాద్, పరిశీలకులుగా పద్మకుమారి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా డి.కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.చైతన్య, కోశాధికారిగా ఎన్.గోపాల్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్.రామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.రమేష్, ఎస్.నాగరాజ, ఎస్.రెడ్డిశేఖర్, ఎన్.కుమార్, ఎస్‌ఏ రహమత్ బాషా, కార్యనిర్వాహక కార్యదర్శిగా సి.బాలాజి, సహాయ కార్యదర్శులుగా ఎస్.సుల్తానా, జి.రేణుకాపతి, బి.దీపిక, సీబీ తులసీరాం, కె.రాజేష్, మహిళా కార్యదర్శిగా ఐ.కృపావతి, సభ్యులుగా ఎస్‌బీ రవిశేఖర్, కె.సాయి ప్రశాంతి, టీజే యువరాజ్, వి.మునిరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగనుంది. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాఘవులు, కార్యదర్శి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

డీకే బద్రీనారాయణ మృతికి పలువురి నివాళి





డీకే బద్రీనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బద్రీనారాయణ మృతదేహానికి ఆదివారం పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. స్థానిక బీవీ రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో మృతదేహాన్ని సందర్శకుల కోసం ఉంచారు. నివాళులర్పించిన వారిలో.. చిత్తూరు, పలమనేరు, తిరుపతి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, అమర్‌నాథరెడ్డి, ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, జిల్లా పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, కార్యనిర్వహక కార్యదర్శి జయచంద్ర నాయుడు, చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, దుర్గమ్మ గుడి మాజీ చైర్మన్ విశ్వనాథ్, వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి, మండి సుధ తదితరులున్నారు.

అక్రమార్కులకు జగన్ వత్తాసు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్



చిత్తూరు సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవుడి సన్నిధిలో అక్రమాలు చేసిన వారికి మాజీ సీఎం జగన్ వత్తాసు పలకడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పరకామణి కేసు చిన్న చోరీ అని జగన్ చెప్పడం దారుణమన్నారు. వెంకటేశ్వర స్వామిపై జగన్‌కు భక్తి, విశ్వాసం, గౌరవం లేవన్నారు. వేరే మతాన్ని విశ్వసిస్తూ, ఆచరించే వ్యక్తులను టీటీడీ బోర్డు చైర్మన్లుగా నియమించి అక్రమాలకు ఆస్కారం కల్పించారన్నారు. కల్తీ నెయ్యితో దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేశారన్నారు. వైసీపీ పాలనలో టీటీడీలో జరిగిన అన్నిరకాల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్ట్



అలెక్స్‌ని అరెస్టు చూపుతున్న డీఎస్పీ సాయినాథ్

గుడిపాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరుస అత్యాచారాలు, హత్యాయత్నాలు, అక్రమ డ్రగ్స్ వ్యాపారాల్లో నిందితుడైన మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర నేరస్తుడిని గుడిపాల పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సాయినాథ్ ఆ వివరాలను ఆదివారం మీడియాకు తెలిపారు. ఈనెల 3న గుడిపాల మండలంలోని అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఓ మహిళ ఫిర్యాదుపై తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన అలెక్స్ అనే నిందితుడిపై అత్యాచారం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు. 2010లో తొలినేరం చేసి జైలుకు వెళ్లిన నిందితుడు.. అప్పటినుంచి దొంగతనాలు, దారిదోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలు, కొట్లాట కేసుల్లో పాల్గొని కరుడుగట్టిన నేరస్తుడిగా మారాడు. 2023లో జైలు నుంచి విడుదలయ్యాక పోలీసుల నుంచి తప్పించుకునేందుకు గుడిపాల మండలానికి చేరుకున్నాడు. ఈక్రమంలో అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఓ కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. కుటుంబ యజమాని కుమార్తెపై ప్రేమ పేరుతో బెదిరింపులకు పాల్పడి ఏడాదిగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. గతనెల 24న బాధితురాలిని అపహరించి, ఆమె తల్లిదండ్రులు, తమ్ముడిపై కత్తితో దాడిచేశాడు. పెప్పర్ స్ప్రే చల్లాడు. ఆపై బాధితురాలిని వారంరోజులపాటు మామిడితోపులో నిర్బంధించి అత్యాచారం చేశాడు. ఈనెల ఒకటో తేదీన బాధితురాలిని ఇంటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ క్రమంలో ఆదివారం నిందితుడిని చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మిందపాళ్యం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతడి వద్ద నుంచి ఇనుపరాడ్డు, పెప్పర్ స్ప్రే, మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషిచేసిన పోలీసులను ఎస్పీ తుషార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. పీజీఆర్ఎస్ హాలులో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని ఆదేశాలిచ్చారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ తుషార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టెట్‌కు 8,597 మంది అభ్యర్థులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 10 నుంచి 21వ తేదీవరకు నిర్వహించే టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్)కు జిల్లాలో 8,597 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. కంప్యూటర్ బేస్డ్‌గా నిర్వహించే ఈ పరీక్ష కోసం జిల్లా విద్యాశాఖ ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరగనుంది. చిత్తూరు ఆర్‌వీఎస్ నగర్, తిరుపతి రోడ్డులోని శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, చిత్తూరు మురకంబట్టు బెంగళూరు-తిరుపతి బైపాస్‌రోడ్డులోని శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, పూతలపట్టు మండలంలోని వేమూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, పలమనేరు మేలుమైలోని మదర్ థెరిసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజి, కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లు సెంటర్లుగా గుర్తించారు. కేటాయించిన పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందు చేసుకోవాలని డీఈవో వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వెంట ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ (ఆధార్/పాన్/డ్రైవింగ్ లైసెన్స్) తీసుకురావాలని, సందేహాలుంటే 73864 08270, 98855 06094, 84989 91250 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సదరన్ డిస్కం సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 8977716661 నెంబరుకు ఫోను చేసి సమస్యలు చెబితే పరిష్కరిస్తామన్నారు. 91333 31912 నెంబరుకూ చాట్‌చేసి సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

సౌభ్రాతృత్వంతో అసూయ దూరం

ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి





గరికపాటి ప్రవచన కార్యక్రమాన్ని ఆస్వాదిస్తున్న జనవాహిని

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యాంత్రిక జీవితంలో ఐక్యత చాలా ప్రధానమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకాళహస్తీశ్వర శతక ప్రవచన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేటి సమాజంలో ఐక్యత లోపించి, మత మౌఢ్యం ప్రబలి మనుషుల మధ్య అశాంతి రగిలిస్తున్నదని గరికపాటి ఆవేదన చెందారు. కావాల్సింది మత జాడ్యం కాదని, పరస్పర స్నేహ సౌభ్రాతృత్వాలన్నారు. వీటితో మనలోని అసూయ, ద్వేషాలు దూరమవుతాయన్నారు. ఇదే శ్రీకాళహస్తీశ్వర శతకంలో ధూర్జటి మహాకవి ఆనాటి జాతి, మతాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని శ్రీ (సాలెపురుగు), కాళ (సర్పం), హస్తి (ఏనుగు)మధ్య పరమేశ్వర సాక్షాత్కారం పొందడానికి అవి పడ్డ వైరాలను ఉదాహరణలుగా రచించి గొప్ప కవీంద్రుడు అయ్యాడని ప్రస్తుతించారు. అనంతరం ఆయన్ను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, శ్రీకాళహస్తీశ్వర ఆలయ పాలకమండలి చైర్మన్ సాయి ప్రసాద్, ఆధ్యాత్మిక ప్రవచన కర్త రాధా మనోహర్‌లు సత్కరించారు. గురజాల చెన్నకేశవులు నాయుడు దంపతులు, నందకుమార్, జీడీ గోపి, కళ్యాణ్ చక్రవర్తి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణలతో మార్మోగిన ముక్కంటి ఆలయాలు



విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి అమ్మవారు

కల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని ముక్కంటి ఆలయాలు ఆదివారం శివనామ స్మరణలతో మార్మోగాయి. మండలంలోని దేవళంపేట కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కల్లూరు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, కావేటిగారిపల్లి, జాండ్రపేట మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయమే వేడుకలు ప్రారంభమయ్యాయి. పరమేశ్వరుని జన్మ నక్షత్రమైన మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు మొదలయ్యాయి. రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పాలాభిషేకం, శుద్ధజలాభిషేకం, అర్చనలు, బిల్వార్చనలు, పుష్పార్చనలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి అమ్మవార్లను అలంకరించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

హిందూ సనాతన ధర్మాన్ని కాపాడటమే లక్ష్యం



కోటపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ ధర్మ పరిరక్షక సభ్యులు

కల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని హిందూ ధర్మ పరిరక్షక సభ్యులు పార్థసారధి, నరేష్, బాబు, శ్రీనివాసులు నాయుడు, రామకృష్ణమ నాయుడు, మునీశ్వర్, సుధాకర్, పెద్దబ్బనాయుడు పిలుపునిచ్చారు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలోని కోటపల్లి, జూపల్లి, పాళెం, కొంగరవారిపల్లిలో ఆదివారం ఇంటింటికెళ్లి హిందూ ధర్మ పరిరక్షణ కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ, సురక్షణ, సంస్కారం నినాదంతో హిందూ సమాజానికి సేవచేద్దామన్నారు. హైందవ గొప్పతనాన్ని వాడవాడలా వివరిద్దామని, దేశ, ధర్మ రక్షణ కోసం నిస్వార్థంగా పనిచేద్దామన్నారు. జనవరి 9న కల్లూరులో నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవకులు, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

అడిషనల్ క్యాంటమ్ పునరుద్ధరణ సంతోషకరం



సమావేశంలో మాట్లాడుతున్న రత్నారెడ్డి

పలమనేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ప్రభుత్వం అడిషనల్ క్యాంటమ్ పునరుద్ధరించడం సంతోషకరమని పలమనేరు పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి గురుమూర్తి అన్నారు. ఆదివారం పలమనేరులోని సంఘం కార్యాలయంలో పెన్షనర్ల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 17న జరిగే పెన్షనర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. 80 ఏళ్లు నిండిన పెన్షనర్లను సన్మానించేందుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు దొరస్వామి, ట్రెజరర్ దవణముని, ఉపాధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, పొన్ముడి, గోవిందరాజులు, సూర్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్యాంరాజ్, రషీద్ అహమ్మద్, ఎంఎస్‌రాజన్న, నాగప్ప, మాసిలామణి, ప్రభాకర్‌రావు, కన్నయ్య, రాజారెడ్డి, బాబాసాహెబ్, శేఖర్, రామచంద్రయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

పుంగనూరులో త్వరలో హిందూ సమ్మేళనం

పుంగనూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో త్వరలో నిర్వహించనున్న హిందూసమ్మేళనాన్ని హిందువులు విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఓ కల్యాణ మండపంలో హిందూసమ్మేళన ప్రాంతం, జనసమీకరణ నిర్వహణపై ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, మేధావులతో చర్చించారు. కార్యక్రమంలో సంఘనాయకులు త్రిమూర్తిరెడ్డి, భక్తవత్సలరాజు, నానబాలమణి, రాజారెడ్డి, జగదీశ్‌రాజు, విజయకుమార్, నరసింహులు, బాలసుబ్రహ్మణ్యం, నానబాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బగ్గిడి గోపాల్

చౌడేపల్లె, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): అభయ ఆంజనేయస్వామి ఆలయ పాలక మండలి అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్‌ను దుర్గసముద్రం పంచాయతీ ప్రజలు ఏకగ్రీవంగా నియమించుకున్నారు. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లె సమీపంలో వెలసిన అంజనేయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, ఆయనతో పాటు మరో 17 మంది మొత్తం 18 మంది కమిటీ సభ్యులను పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా నియమించుకున్నారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం నూతన కమిటి సభ్యులు ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైసీపీ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీగా సదుం వాసి



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న మైనారిటీ నాయకులు

సదుం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీగా సదుం వాసి, విశ్రాంత ఉపాధ్యాయుడు ఖమ్రుద్దీన్ ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఖమ్రుద్దీన్ స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులతో తిరుపతిలోని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సయ్యద్ బాషా, ఖాజాపీర్, బాబు రెడ్డి, బావాజీ, అంజద్, షబ్బీర్, మునాఫ్, చిన్నా, రమణ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల తాలూకా నూతన అధ్యక్షురాలిగా మధుబాల



నూతనంగా ఎంపికైన కార్యవర్గం

పుంగనూరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పుంగనూరు తాలూకా నూతన అధ్యక్షురాలుగా మధుబాల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు శివయ్య తెలిపారు. ఆదివారం పుంగనూరులో జరిగిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పుంగనూరు తాలూకా యూనిట్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. నూతన అధ్యక్షురాలిగా మధుబాల, కార్యదర్శిగా అక్బర్, సహాయ కార్యదర్శులు గణేశ్, వెంకటేశ్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. జిల్లా కోశాధికారి దేవప్రసాద్, మోహన్, నాగేనాయక్, ఆయేషా, సుధా తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం కూల్చివేత



సి.బండపల్లె గ్రామంలో కోదండ రామాలయాన్ని కూల్చుతున్న ఎక్స్‌కవేటర్

శాంతిపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సి బండపల్లె గ్రామంలోని కోదండ రామాలయాన్ని కొంతమంది స్థానికులు ఆదివారం కూల్చివేశారని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సుమారు 300 సంవత్సరాల క్రితం నాటి పురాతనమైన కోదండ రామాలయంలో గ్రామస్తులు నిత్యం పూజలు చేస్తున్నారు. కొంత మంది స్థానికులు రాజకీయ దురుద్దేశంతో ఆలయాన్ని కూల్చేశారని పేర్కొన్నారు. ఆలయ కూల్చివేతను అడ్డుకున్న గ్రామస్తుడు శ్రీనివాసులపై దాడికి యత్నించారని వాపోయారు. ఆలయాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గంగవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మదర్‌థెరిసా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావ్ పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా ఏడోరోజు ఆదివారం మేలుమాయి గ్రామంలో పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనవసరంగా వాట్సప్ లలో వచ్చే యాప్‌లు, లింక్‌లు క్లిక్ చేయరాదని, ఒకవేళ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చి ఓటీపీ చెప్పాలని, పిన్‌కోడ్ చెప్పాలని , మీకు లోన్ మంజూరైందని ఆశచూపి ఎరవేస్తారని తెలిపారు. అలాంటి వాటికి మోసపోకుండా లింక్‌లు క్లిక్ చేయకుండా, ఓటీపీ చెప్పకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాంటి అపరిచిత ఫోన్‌కాల్స్, లింక్స్ వస్తే తక్షణం సైబర్ క్రైమ్‌కు, దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి దేవేంద్రరెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత మెగావైద్య శిబిరానికి స్పందన



శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో పీఈఎస్ వైద్యులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత మెగావైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు 125 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ హరితేజ, గాయత్రి, హర్షిత, సాయినాథ్‌రెడ్డి, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం



అలంకరణలో అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి

పుంగనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం రాత్రి పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు బాలసుబ్రహ్మణ్యంస్వామి, రామచంద్రస్వామి వైభవంగా అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామివారికి కల్యాణం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణానికి ముస్తాబు చేసి భక్తిశ్రద్ధలతో విశేషపూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మాంగళ్యధారణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అలాగే స్థానిక బస్టాండ్ వద్దగల భోగనంజుండేశ్వరస్వామి, నగిరిలో వెలసిన ప్రసన్నపార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామి, అఘోర వీరభద్రస్వామి ఆలయం, నెక్కొంది అగస్తీశ్వర స్వామి ఆలయాల్లో ఉదయాన్నే ఆలయాల అర్చకులు సుప్రభాతంతో స్వామివార్లను మేల్కొలిపి అభిషేకాలు, హోమాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. శైవ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

45 మందికి ఉచిత నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు మురళీ

పలమనేరు, డిసెంబరు7 (ఆంధ్ర జ్యోతి) : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరంలో 45 మందికి చె శంకరనేత్రాలయ నేత్రవైద్యులు మురళి నేత్రపరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. ఎంపికైన వారికి ఉచితంగా చెన్నై శంకర నేత్రాలయలో ఆపరేషన్లు నిర్వహిస్తారని, చెన్నై వెళ్లి రావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామని నేత్రవైద్యులు మురళీ తెలిపారు.

కెంచనబల్ల తోట్లచెరువుకు జలకళ



నిండుకుండలా కళకళలాడుతున్న కెంచనబల్ల తోట్లచెరువు



మొరవ పారుతున్న తోట్లచెరువు

రామకుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని చెరువులు ఒక్కొక్కటిగా హంద్రీ-నీవా కృష్ణాజలాలతో నిండుతున్నాయి. 773 కిలోమీటర్ల నుంచి తరలివచ్చిన కృష్ణమ్మ గత ఆగస్టు రెండో వారంలో కుప్పం నియోజకవర్గం బైపరెడ్లపల్లె వద్ద గల హంద్రీ-నీవా కాలువకు చేరుకుంది. ఆగస్టు మాసాంతానికి కుప్పం నియోజకవర్గం చివరన ఉన్న పరమసముద్రం చెరువుకు చేరింది. సెప్టెంబరు 4న ఆ చెరువు మొరవ పారింది. ఆగస్టు 30న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరమసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువలో కృష్ణాజలాలకు జలహారతి ఇచ్చారు. అక్కడ ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని చెరువులకు కృష్ణాజలాలు చేరేలా చూస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు. పరమసముద్రం చెరువు తర్వాత కుప్పం మండలం వీరప్పరాయని చెరువు, డీకేపల్లి, శాంతిపురం మండలం తుమ్మిశి పెద్దచెరువు, రామకుప్పం మండలం బైపరెడ్లపల్లెచెరువు, అత్తికుప్పం జిల్లాస్‌చెరువు, మణీంద్రంచెరువు, విజలాపురం పెద్దచెరువులు హంద్రీ-నీవా కాలువ ద్వారా వచ్చిన కృష్ణాజలాలతో నిండి మొరవలు పారతున్నాయి. గతనెల సీఎం సతీమణి నారాభువనేశ్వరి కుప్పం డీకేపల్లెచెరువు, తుమ్మిశిపెద్దచెరువు, విజలాపురం పెద్దచెరువుల్లో మొరవల వద్ద పూజలు చేసి జలహారతి ఇచ్చారు. 20 రోజుల క్రితం అత్తికుప్పం జిల్లాస్‌చెరువు మొరవ పారడంతో కృష్ణాజలాలు మండలంలో అతిపెద్దచెరువుల్లో ఒకటైన కెంచనబల్ల తోట్లచెరువు వైపు ప్రవహించడం ప్రారంభమైంది. తోట్లచెరువు కృష్ణాజలాలతో పూర్తిగా నిండి గత రెండు రోజులుగా మొరవ పారడం ప్రారంభమైంది. ప్రసుత్తం మొరవప్రవాహం ఉధృతంగా సాగుతోంది. తోట్లచెరువు నుంచి జలాలు తమిళనాడుకు చేరుతాయి. వృథాగా జలాలు తమిళనాడుకు పోకుండా తోట్లచెరువు కింది భాగంలో ఉన్న చెక్‌డ్యాంలను పటిష్ఠం చేస్తూ అవసరమైన చోట మరిన్ని చెక్‌డ్యాంలు నిర్మిస్తే ఇక్కడి రైతులకు సౌకర్యంగా ఉంటోంది. రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాజలాలు వచ్చేలా చూసినసీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుడు కథనాలతో నాగేశ్వరనాయుడిపై ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్

చౌడేపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కథనాలతో అబ్బర్వర్ నాగేశ్వరనాయుడిపై అసత్య ఆరోపణలు తగవని మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక దొరబావితోట వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయకొండ గంగమ్మ ఆలయంలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని విచారణ చేపట్టి దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆరు నెలల క్రితం చౌడేపల్లెకు పరిశీలకులుగా వచ్చిన శ్రీనివాసులు ఫొటోతో అసత్య ఆరోపణలు చేస్తూ ప్రస్తుత పరిశీలకులు నాగేశ్వరనాయుడిపై కొందరు పలు పత్రికల్లో ఫొటో కథనాలు రాయించడం దారుణమన్నారు. తమ పదవులు పోతాయని కొందరు నాయకులు, అబ్జర్వర్ ప్రలోభాలకు లొంగక పోవడంతో ఇలా అసత్య కథనాలకు తెరలేపారని ఆరోపించారు. మండల అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు అధిష్ఠానానికి తీసుకుపోవడంతో తమ పదవులు పోతాయని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. అలాగే బోయకొండ రామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తమ ఇళ్లు కూల్చేశారని.. అప్పుడే విషయాన్ని పార్టీ కార్యాలయ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రూ.12 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని ఆలయ ఈవోను ఆదేశించినట్లు తెలపారు. కొందరు తనకు నష్ట పరిహారం ఇవ్వకుండా కోర్టుకు వెళ్లారని.. తనకు ఇంకా నష్ట పరిహారం అందలేదన్నారు. కొందరు కావాలనే అబ్జర్వర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఫేక్ ఫొటోలు, ఫేక్ వార్తలతో ఆయనపై అసత్య ప్రచారం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ పగడాల హరిప్రసాద్, టీడీపీ నాయకులు గంగాధర్‌రెడ్డి, పార్థసారధి, కార్తిక్, నరేష్‌బాబు, పవన్ పాల్గొన్నారు.

కమనీయం... శ్రీవారి కల్యాణోత్సవం



స్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

సోమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలోని వేంకటేశ్వరస్వామి పాదాల ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాల నేపథ్యంలో ఆదివారం భూనీళాదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. కలశారాధన, సుదర్శన హోమం, పూర్ణాహుతి, అష్టావధాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల కల్యాణ మండపాన్ని సుందరంగా పుష్పాలతో అలంకరించి భూనీళాదేవి సమేత శ్రీవారి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా ఉభయదారులు డాక్టర్ ప్రదీప్ కుమార్, శ్వేత దంపతులు జరిపించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చంద్రశేఖర్, శ్యాంసుందర్, మదనపల్లె బీటీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వై.ఎస్. మునిరత్నం, అర్చకులు పాగొండ వేణుగోపాల్, మోహన్‌బాబు, పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోసం పనిచేసిన వారందరికీ గుర్తింపు



పెద్దఉప్పరపల్లెలో టీడీపీ నాయకులతో పరిశీలకులు వెంకటరమణ

సోమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి జైలుకెళ్లిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తించి న్యాయం చేస్తుందని రాష్ట్ర పార్టీ పరిశీలకులు , కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వలిగట్ల వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం పెద్దఉప్పరపల్లె 150, 160 బూత్ కార్యకర్తలతో పార్టీ పరిస్థితులు, స్థానిక ఎన్నికల్లో విజయ సాధన కోసం బలోపేత చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మహేంద్రకుమార్, మాజీ సర్పంచులు బంగారప్ప, బాలాజీ నాయుడు, నరసింహ యాదవ్, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన ర్యాలీ



సోమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులో ఆదివారం కైలాస పిరమిడ్ ధ్యాన మందిరం 7వ వార్షికోత్సవం సందర్భంగా ధ్యానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ధ్యాన పిరమిడ్ గురువులు కిట్టు కళాధర్ మాట్లాడుతూ పిరమిడ్‌లో ధ్యానం చేయడం వల్ల నాడీ మండలం శుద్ధి జరుగుతుందన్నారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మానసిక ప్రశాంతత, బుద్ధి వికాసం కలుగుతుందని వివరించారు. అనంతరం పురవీధుల్లో కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కందూరు, వల్లిగట్ల, చెరుకువారిపల్లె, బాలప్పగారిపల్లె, నెల్లిమంద తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కాణిపాకానికి తరలిన తెలుగు తమ్ముళ్లు



కాణిపాకం పాలకమండలి సభ్యురాలు వసంతమ్మను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి శాంతిపురం మండల తెలుగు తమ్ముళ్లు, తెలుగు మహిళా నేతలు తరలి వెళ్లారు. ఆదివారం కాణిపాకం ఆలయంలో పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. నియోజకవర్గం నుంచి కుప్పం మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు వసంతమ్మ, కుప్పం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి నరేష్‌కు పాలకమండలి సభ్యులుగా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. వారి ప్రమాణ స్వీకారోత్సవానికి శాంతిపురం టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో నాయుకులు, మహిళా నేతలు భారీగా తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం పాలకమండలి సభ్యులు వసంతమ్మ, నరేష్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ విశ్వనాథ నాయుడు, సింగిల్ విండో ఛైర్మన్ గోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జీలు వీవీ నాగరాజు, రాజేంద్ర, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్‌ఎస్ మణి, లోకేష్, గిరిధర్, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, నేతలు సింగిరి శ్రీనివాసులు, క్యాబేజి మురళీ, శివకుమార్, శంకర్, జయరాం, మంజునాథ్, సుజల శివ, కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, చంద్రకళ, ఏఎంసీ డైరెక్టర్ శ్యామల, మండల మహిళా అధ్యక్షురాలు హేమావతి, మాజీ జడ్పీటీసీ శకుంతల, మండల ప్రధాన కార్యదర్శి సరిత, రూప, వేద, పౌలారాణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెరగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు

పుంగనూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సేవ, సామాజిక బాధ్యత పెరగాల్సిన అవసరముందని పుంగనూరు బసవరాజ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ కాలనీ పాఠశాలలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక క్యాంపు ముగింపు సందర్భంగా విద్యార్థులు, స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు పరిశుభ్రత, అత్యవసర పరిస్థితుల్లో జరిగే ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారుల సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాభావం, క్రమశిక్షణ అలవరుచుకోవాలని కోరారు. సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శరవణ్‌కుమార్, అధ్యాపకులు చెంగయ్య, బాలరాజునాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తన భార్య ఆచూకీ తెలపాలంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో పట్టణ ఎస్‌ఐ రమేష్ బాబు వివరాల మేరకు హైదరాబాద్‌కు చెందిన నందిని (20) అనే యువతికి నగరంలోని మంగసముద్రానికి చెందిన మురళీకృష్ణతో రెండేళ్ళ క్రితం వివాహమైంది. డెలివరీబాయ్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ ఆదివారం యథావిధిగా పనులకు వెళ్ళిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిచూడగా భార్య నందిని కనపడలేదు. బంధువులు, చుట్టుప్రక్కల వారిండ్లల్లో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రహదారి మరమ్మతులకు సహకారం


గుంతలను పూడుస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆయన ఎదురుచూడలేదు. గ్రామస్థుల కష్టాలను తీర్చేందుకు తానే ముందుకు వచ్చారు. రోడ్డు బాగుచేయించడానికి నడుం బిగించారు. పిల్లిగుండ్లపల్లి నుంచి మంగుంట వెళ్లే తారురోడ్డు ఇటీవల వర్షాలకు గుంతలమయమైంది. ఆ గుంతల్లో నీరు చేరి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు దుస్థితిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైయింది. దీనిపై స్పందించిన పిల్లిగుండ్లపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు(అలియాస్ మొద్దు నాయుడు) స్పందించారు. ఈ రోడ్డు గుంతలను పూడ్చేందుకు ట్రాక్టర్‌తో మట్టి తోలించారు. రోడ్డు కడగండ్లను తీర్చేందుకు ముందుకువచ్చిన ఆయనను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

దేశమ్మ గుడికి గొడుగు, పీఠం వితరణ


దేశమ్మతల్లి ఆలయానికి గొడుగు, పీఠం వితరణ చేస్తున్న భక్తులు

నగరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని టీఆర్ కండ్రిగలో వెలసిన నేత్ర ప్రధాని దేశమ్మతల్లి ఉత్సవమూర్తులకు పీఠం గొడుగులను అ య్యప్ప భక్త బృందం, భాస్కర్ చామంతి దంపతులు విరాళంగా అందజేశారు. అయ్యప్ప భక్త బృందం సభ్యులు రూ.18 వేలు, భాస్కర్ దంపతులు రూ.10 వేలు వెచ్చించి వితరణగా వీటిని ఆదివారం అందించారు. ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మదన్‌కుమార్, కృష్ణారెడ్డి, లక్ష్మి, అయ్యప్ప భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు


మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్,నాయకులు

నగరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరైనట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో వివిధ పథకాల కింద రెండు కోట్ల రూపాయలను మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం మంజూరైనట్లు తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.25 లక్షలు సీసీ రోడ్లకు రూ.1.13కోట్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ.64 లక్షలు, పైపులైన్లకు రూ.9 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద దళితవాడలకు రూ.12 లక్షలు, ఏకాంబరకుప్పానికి రూ.12 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. టీఆర్ కండ్రిగ వార్డులో ఇందిరమ్మ కాలనీకి మొదటి విడతగా రూ.14.40 లక్షలు మంజూరు చేశారన్నారు. నగరి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, టీడీపీ నాయకులు సదాశివరెడ్డి, దేశమ్మగుడి కమిటీ మెంబరు మదన్‌కుమార్, మణి, అశోక్, లోకేంద్ర, ఎస్సీసెల్ నాయకుడు అల్లిముత్తు, సుబ్బులునాయుడు, సలీం, శ్రీధర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూతలపట్టు నుంచి టీడీపీ నేతల ర్యాలీ


నాగరాజ నాయుడిని సన్మానిస్తున్న యువరాజు నాయుడు తదితరులు

పూతలపట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ట్రస్టు బోర్డు మెంబర్‌గా పోటుకనుమకు చెందిన ఊట్ల నాగరాజులు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా మండల టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పూతలపట్టులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత యువరాజు నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, నాయకులు బాలక్రిష్ణమ నాయుడు, హిమగిరి నాయుడు, హరి, ఇంద్రసేన నాయుడు, రవి నాయుడు, హేమాద్రి నాయుడుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

వెదురుకుప్పం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పెద్దహరిజనవాడలో ఆదివారం మురుగునీటి కాలువ నిర్మాణ పనులను సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శాంతిశేషాద్రిలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.3లక్షలతో ఈ పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంటు శశికుమార్ పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యుడికి అభినందన


సుబ్బారెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

వెదురుకుప్పం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాణిపాకం దేవస్థానం పాలక మండలి సభ్యుడు, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పెరుమాళ్ సుబ్బారెడ్డిని ఆదివారం వెదురుకుప్పం బీజేపీ నాయకులు కలిశారు. అభినందనలు తెలిపారు. కలిసిన వారిలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.విశ్వనాథరెడ్డి ఉన్నారు.

ఘనంగా ఆరుద్ర నక్షత్ర పూజలు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయంలో ఆదివారం ఆరుద్ర నక్షత్ర పూజలను ఆలయ అర్చకులు వేణుగోపాల్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భజగోవిందం, విష్ణు సహస్ర పారాయణం చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసదాలు పంపిణీ చేశారు.

45 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

పలమనేరు, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరంలో 45 మందికి చె శంకరనేత్రాలయ నేత్రవైద్యులు మురళి నేత్రపరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. ఎంపికైన వారికి ఉచితంగా చెన్నై శంకర నేత్రాలయలో ఆపరేషన్లు నిర్వహిస్తారని, చెన్నై వెళ్లి రావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామని నేత్రవైద్యులు మురళి తెలిపారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

చిత్తూరు అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం


చెక్కును అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నప్రసాద ట్రస్టుకు యాదాద్రి భువనగిరికి చెందిన రాజేంద్రప్రసాద్‌రెడ్డి రూ.1,00,335 చెక్కు రూపంలో ఆదివారం విరాళంగా అందించారు. విరాళదాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం అర్చకుఉలు వేదాశీర్వాద మండపంలో వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


ర్యాలీలో పాల్గొన్న పాస్టర్లు,క్రైస్తవులు

వెదురుకుప్పం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం బాలగుంత వద్ద బేతేలు షారన్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాక పుర వీధుల్లో ఏసుక్రీస్తు వేషధారణలో ఉన్న వ్యక్తితో పాటు పాస్టర్లు, విశ్వాసకులు ర్యాలీగా వెళ్లారు. తరువాత అన్నదానం చేశారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన గుణబాలరాజ్, పాస్టర్లు ఆశీర్వాదం,బాబుస్వామి, వేలు, విశ్వాసకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తన భార్య ఆచూకీ తెలపాలంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో పట్టణ ఎస్ఐ రమేష్ బాబు వివరాల మేరకు హైదరాబాద్‌కు చెందిన నందిని (20) అనే యువతికి నగరంలోని మంగసముద్రానికి చెందిన మురళీకృష్ణతో రెండేళ్ల క్రితం వివాహమైంది. డెలివరీబాయ్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ ఆదివారం యథావిధిగా పనులకు వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిచూడగా భార్య నందిని కనపడలేదు. బంధువులు, చుట్టుప్రక్కల వారిండ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

9న బంగారమ్మ జాతర


ముఖ్య నేతలతో సమావేశమైన ప్రసాద్

వెదురుకుప్పం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ జాతరను విజయవంతం చేద్దామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పేటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్వేటినగరంలో జాతరపై ముఖ్యులతో సమావేశమయ్యారు. ఈ నెల 9న జాతర చాటింపు, 16,17 తేదీల్లో జాతర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందరూ సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత మెగావైద్య శిబిరానికి స్పందన


శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో వైద్యులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత మెగావైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యనిపుణులు 125 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. వైద్యులు డాక్టర్ హరితేజ, గాయత్రి, హర్షిత, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరకొర వసతుల మధ్య తప్పని అవస్థలు


కార్యాలయానికి కేటాయించిన స్థలం తయారైందిలా..


ఐసీడీఎస్ కార్యాలయ(అద్దె) భవనం

వెదురుకుప్పం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఐసీడీఎస్ కార్యాలయం అరకొర వసతులు ఉన్న అద్దె భవనాల్లో నడుస్తోంది. ఏళ్లు గడుస్తున్నా సొంత భవనం కల సాఫల్యం కావడం లేదు. ఇక్కడి ఐసీడీఎస్ పరిధిలో వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాలున్నాయి.ఈ మండలాల్లో 201 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 201 మంది వర్కర్లు, 40 మంది సహాయకులు పనిచేస్తున్నారు. 1993లో కార్యాలయం మంజూరైంది. అప్పటి నుంచి వివిధ అద్దె భవనాలే దిక్కయ్యాయి. వసతుల కొరతలేమితో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

ప్రస్తుత కార్యాలయ భవనంలో ఉద్యోగులు సమీక్షలకు వస్తే మల, మూత్ర విసర్జనలకు కూడా అవకాశం లేదు. ఒకే మరుగుదొడ్డి ఉంది. సమీక్షలు నిర్వహించడానికి అనుకూలమైన సమావేశపు మందిరం లేదు. పదేళ్ల క్రితం కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయం వెనుక కొంత స్థలాన్ని ఈ కార్యాలయ నిర్మాణానికి కేటాయించారు. గత వైసీపీ పాలనలో నిధులు కేటాయించామని చెప్పారే తప్ప పైసా విదిల్చిన పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి సొంత భవన వసతి కల్పించాలని ఇక్కడి సిబ్బంది కోరుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ చొరవ తీసుకోవాలంటున్నారు.

ఈ రహదారుల్లో రాకపోకలు సాగించేదెలా?


మహారాజపురం-కనకమ్మసత్రం రోడ్డు ఇది


ఒరూరు వద్ద రోడ్డు గుంతలమయం

విజయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని తారు రోడ్లు దయనీయస్థితికి చేరుకున్నాయి. ముఖ్యంగా కనకమ్మసత్రం - విజయపురం రోడ్డు రాకపోకలకు పరీక్ష పెడుతోంది. ఈరోడ్డులో పాత మహారాజపురం వద్ద వాహన చోదకులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ఎక్కడ కింద పడిపోతామోనని హడలిపోతున్నారు. చీకటి పడితే గోతులు కనబడక కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఒరూరు వద్ద వర్షపునీరు వెళ్ళడానికి మార్గం లేకపోడంతో ఇటీవల వేసిన తారురోడ్డు సైతం దారుణస్థితికి చేరుకుంది. ఇటీవల వర్షాలు నిరంతరాయంగా కురవడంతో ఆలపాక కండ్రిగ - జీఎంపురం రోడ్డు, ఎస్ఎన్‌కండ్రిగ - ఇళ్ళత్తూరు రోడ్డు కూడా గుంతల మయంగా మారిపోయాయి. వర్షాలు ముగిశాకయినా తక్షణం మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అసంపూర్తి నిర్మాణంతో ఇబ్బందులు


కనీస వసతులు లేని స్త్రీశక్తి భవనం

గుడిపాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మరకాలకుప్పం పంచాయతీకి సంబంధించి స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో మహిళాసభ్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. పదేళ్ళ క్రితం ఈ భవన నిర్మాణం చేపట్టారు. చివరి దశలో వదిలేశారు. నాటి నుంచి భవనం అసంపూర్తిగానే నిలిచిపోయింది. ఈ పంచాయతీలో సుమారు 25 మహిళా సంఘాలు ఉన్నాయి. సమావేశాలు నిర్వహించుకోవాలన్నా, ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టాలన్నా మహిళాసంఘాల సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ భవనంలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని వీరు చెబుతున్నారు. . సమావేశాలు ఆరుబయటే నిర్వహించుకోవాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బీసీ అధికారులను కించపరచడం తగదు


మాట్లాడుతున్న శ్రీధర్‌యాదవ్,టీడీపీ నాయకులు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీకి చెందిన అధికారులను మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి కించపరిచి మాట్లాడటం తగదని జిల్లా టీడీపీ యాదవసాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ అన్నారు. గంగాధరనెల్లూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవసామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర పొల్యూషన్‌బోర్డు చైర్మన్ కృష్ణయ్య, డీఐజీ జెట్టి గోపినాథ్‌లను వాడు వీడు అని అవహేళనగా సంబోధించిడం సమసంజసం కాదన్నారు. యాదవ కులాలకు చెందిన అధికారులను అగౌరవపరిచి మాట్లాడిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పని పక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల సింగిల్ విండో డైరెక్టర్ జ్యోతియాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లోకమ్మ, మండల టీడీపీబీసీసెల్ ప్రధానకార్యదర్శి మురళీయాదవ్, యాదవ మహిళసాధికారత అధ్యక్షురాలు గాయత్రి, భువనేశ్వరి, గోపియాదవ్‌లు పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసమితి సేవలు వెలకట్టలేనివి


వ్యాసరచన పోటీల విజేతలతో జిల్లా రిజిస్ట్రార్ వెంకట రమణమూర్తి

చిత్తూరు కల్చరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): సమాజంలో సత్యసాయి సేమితి నిస్వార్థ సేవలు వెలకట్ట లేనవని జిల్లా రిజిస్ట్రార్ వెంకట రమణమూర్తి అన్నారు. ఆదివారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్ చైర్స్ , వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు, మెమెంటోలు,రిజిస్ట్రార్ అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు యస్. మధుసూదనం, నగర కన్వీనర్ ఆర్. ప్రభాకర్ నాయుడు, సత్యనారాయణ, పాండురంగం, వసంత పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


హరీష్‌యాదవ్‌కు కేక్ తినిపిస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామానికి చెందిన టీడీపీ యువనేత హరీష్ యాదవ్ తన జన్మదినం సందర్భంగా గంగాధరనెల్లూరు బస్టాప్ వద్ద ఆదివారం 500 మంది పేదలకు అన్నదానం చేశారు. అక్కడే భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, నాయకులు లోకనాథనాయుడు,శ్రీధర్‌యాదవ్, తలారి రెడ్డెప్ప, స్వామిదాస్, జయశంకర్ నాయుడు, రుద్రయ్యనాయుడు, కోదండరెడ్డి, నియాజ్‌అలీ, శేఖర్ పాల్గొన్నారు.

14న రేణుకాంబ మహా కుంభాభిషేకం

గుడిపాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన బొమ్మసముద్రం రైల్వే గేటు సమీపంలో వున్న రేణుకాంబ ఆలయంలో ఈనెల 14వ తేదీన మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ప్రజలు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

టీడీపీ నాయకుల నివాళి

పూతలపట్టు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ మాజీ కన్వీనర్, సీనియర్ నేత ప్రతాపనేని చంద్రమౌళి తల్లి సరోజమ్మకి మృతికి పలువురు నాయకులు నివాళులర్పించారు. సామనత్తం గ్రామంలో ఆదివారం శుభస్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు మురళీమోహన్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నాయకులు యువరాజులు నాయుడు, దొరబాబు చౌదరి, వసంత్‌కుమార్, మోహన్ నాయుడు, చిరంజీవి, కార్జాల అరుణతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

టీడీపీ కార్యకర్త గుండెపోటుతో మృతి


కామాక్షి(ఫైల్‌ఫొటో)

విజయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కళియంబాకానికి చెందిన టీడీపీ కార్యకర్త కామాక్షి(45) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. ఉదయం వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం బయలు దేరు సమయంలో చాతిలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే నగరి ఆస్పత్రికి తరలిస్తుండగా తుదిశ్వాస విడిచారు. ఆమె మృతికి పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మణినాయుడికి శుభాకాంక్షలు


మణినాయుడిని సత్కరించిన మురళి,టీడీపీ నాయకులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాణిపాకం పాలక మండలి నూతన చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన మణినాయుడిని ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి సత్కరించారు. ఎన్టీఆర్ షీల్డ్ మెమెంటోను ఆయనకు అందజేశారు. మురళి వెంట పత్తిపాటి నాగేశ్వరరావు, గుంటూరు ప్రకాష్ చౌదరి, తులసీ యాదవ్,ఉదయ్‌కుమార్ ఉన్నారు.

నేటి నుంచి భగవద్గీత ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రాధా మనోహర్‌దాస్ భగవద్గీత ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు చిత్తూరు నారాయణీ సేవాసమితి నిర్వాహకులు చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రామాలయం కూల్చివేతపై ఫిర్యాదు

శాంతిపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సి బండపల్లెలోని కోదండ రామాలయాన్ని కొంతమంది స్థానికులు ఆదివారం కూల్చివేశారని గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పురాతనమైన కోదండ రామాలయంలో గ్రామస్థులు నిత్యం పూజలు చేస్తున్నారు. కొంత మంది స్థానికులు రాజకీయ దురుద్దేశంతో ఆలయాన్ని కూల్చేశారని పేర్కొన్నారు. ఆలయ కూల్చివేతను అడ్డుకున్న గ్రామస్థుడు శ్రీనివాసులపై దాడికి యత్నించారని వాపోయారు. ఆలయాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పేర్కొన్నారు.

హంద్రీ-నీవాతో చెరువులకు జలకళ



నిండుకుండలా కళకళలాడుతున్న కెంచనబల్ల తోట్లచెరువు- మొరవ పారుతున్న తోట్లచెరువు

రామకుప్పం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని చెరువులు ఒక్కొక్కటిగా హంద్రీ-నీవా కృష్ణాజలాలతో నిండుతున్నాయి. 773 కిలోమీటర్ల నుంచి తరలివచ్చిన కృష్ణమ్మ గత ఆగస్టు రెండో వారంలో కుప్పం నియోజకవర్గం బైపరెడ్లపల్లె వద్ద గల హంద్రీ-నీవా కాలువకు చేరుకుంది. ఆగస్టు మాసాంతానికి కుప్పం నియోజకవర్గం చివరన ఉన్న పరమసముద్రం చెరువుకు చేరింది. సెప్టెంబరు 4న ఆ చెరువు మొరవ పారింది. ఆగస్టు 30న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరమసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువలో కృష్ణాజలాలకు జలహారతి ఇచ్చారు. అక్కడ ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని చెరువులకు కృష్ణాజలాలు చేరేలా చూస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు. పరమసముద్రం చెరువు తర్వాత కుప్పం మండలం వీరప్పరాయని చెరువు, డీకేపల్లి, శాంతిపురం మండలం తుమ్మిశి పెద్దచెరువు, రామకుప్పం మండలం బైపరెడ్లల్లెచెరువు, అత్తికుప్పం జిల్లాస్‌చెరువు, మణీంద్రంచెరువు, విజలాపురం పెద్దచెరువులు హంద్రీ-నీవా కాలువ ద్వారా వచ్చిన కృష్ణాజలాలతో నిండి మొరవలు పారతున్నాయి. గతనెల సీఎం సతీమణి నారాభువనేశ్వరి కుప్పం డీకేపల్లె చెరువు, తుమ్మిశిపెద్దచెరువు, విజలాపురం పెద్దచెరువుల్లో మొరవల వద్ద పూజలు చేసి జలహారతి ఇచ్చారు. 20 రోజుల క్రితం అత్తికుప్పం జల్లాస్‌చెరువు మొరవ పారడంతో కృష్ణాజలాలు మండలంలో అతిపెద్దచెరువుల్లో ఒకటైన కెంచనబల్ల తోట్లచెరువు వైపు ప్రవహించడం ప్రారంభమైంది. తోట్లచెరువు కృష్ణాజలాలతో పూర్తిగా నిండి రెండు రోజులుగా మొరవ పారడం ప్రారంభమైంది. ప్రసుత్తంప్రవాహం ఉధృతంగా సాగుతోంది. తోట్లచెరువు నుంచి జలాలు తమిళనాడుకు చేరుతాయి. వృథాగా జలాలు తమిళనాడుకు పోకుండా చెరువు కింది భాగంలో చెక్‌డ్యాంలను పటిష్ఠం చేస్తూ అవసరమైన చోట మరిన్ని చెక్‌డ్యాంలు నిర్మిస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది.